క్లుప్తంగా

మంత్రి హరీశ్‌రావుకు న్యూ ఇయర్ గ్రీటింగ్స్



మంత్రికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీ ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

సిద్దిపేటజోన్: ఆర్థిక, వైద్యారోగ్యా శాఖ మంత్రి హరీశ్‌రావును బుధవారం సిద్దిపేట, మెదక్ జిల్లాల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు ఎంపీ ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డిలు కలిశారు. ఈ సందర్భంగా వారు మంత్రికి పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

పౌష్టికాహారం లభ్యతపై సర్వే

చిన్నశంకరంపేట(మెదక్): దళిత వాడల్లో ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల నిర్వహణతోపాటు దళితులకు విద్య, వైద్యం, పౌష్టికార లభ్యతపై జై భీమ్ సంఘం ఆధ్వర్యంలో సర్వే నిర్వహించినట్లు సంఘం కన్వీనర్ మురళీమాదిగ తెలిపారు. బుధవారం మండలంలోని మీర్జాపల్లి, మడూర్, గజగట్లపల్లి, కొర్విపల్లి గ్రామాల్లో పర్యటించి అంగన్వాడీ కేంద్రాలలో దళిత బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారంపై వివరాలు సేకరించినట్లు తెలిపారు. ప్రభుత్వ పథకాలను దళితులకు వందశాతం అందించేలా ప్రభుత్వ అధికారులు చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో జై భీమ్ సభ్యులు సంజీవ్, మల్లేశం, సర్పంచ్ నర్సమ్మ, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను పరామర్శ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని చందంపేట గ్రామ టీఆర్‌ఎస్ అధ్యక్షుడు స్వామి తండ్రి కిషన్ గుండెపోటుతో మృతి చెందగా మెదక్ ఎమ్మెల్యే పద్మావేందర్‌రెడ్డి బుధవారం కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే రుద్రారం గ్రామంలోని గౌస్ తల్లి జుబేదా బేగం మృతి చెందిన విషయం తెలుసుకొని పరామర్శించారు. ఆమె వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పట్లోరి రాజు, సర్పంచ్‌లు శ్రీలతస్వామి, లక్ష్మణ్, యాదగిరి, శ్రీనివాస్‌రెడ్డి ఉ న్నారు.

విధుల్లోకి తీసుకోవాలని నిరసన



నిరసన తెలుపుతున్న నాయకులు

చేగుంట(తూప్రాన్): తొలంగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ కార్మిక సంఘం నాయకులు చిన్నశివునూర్ వెంకటేశ్వర కాయర్ పరిశ్రమ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశం మాట్లాడుతూ.. వెంకటేశ్వర కాయర్ పరిశ్రమలో పని చేస్తున్న తొమ్మిది మంది కార్మికులను యాజమాన్యం అకారణంగా తొలగించినట్లు ఆరోపించారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించకుంటే కార్మికుల పక్షాన పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మహిళ నాయకులు బాలమణితోపాటు కార్మికులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు చేయూత



చెక్కులు అందజేస్తున్న దృశ్యం

శివ్వంపేట(నర్సాపూర్) : రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేస్తుందని జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మన్సూర్ అన్నారు. బుధవారం మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ రవి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ జంగం శ్రీనివాస్

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో ఆయా గ్రామాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని ఎంపీపీ జంగం శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ రాజ్ పనులతోపాటు సీడీపీ నిధులతో చేపట్టిన పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. పనులు పూర్తి చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కలిసి పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రఫీఖ్ ఉన్నీసా, పీఆర్ డీఈ శ్రీనివాస్, ఏఈ బాల్‌లింగ, సర్పంచ్‌లు సత్యనారాయణ పాల్గొన్నారు.

దారికొచ్చేనా?



దెబ్బతిన్న రహదారి

- అధ్వానంగా మెదక్–కామారెడ్డి జిల్లాల సరిహద్దు గ్రామాల రోడ్లు
- తారుకు నోచుకోని వైనం
- ఇబ్బంది పడుతున్న రైతులు, ప్రజలు
- పట్టించుకోని అధికారులు

రామాయంపేట(మెదక్): మెదక్, కామారెడ్డి జిల్లాల సరిహద్దు గ్రామాలను కలిపే రహదారి పూర్తిగా శిథిలమవడంతో రెండు జిల్లాల శివారు గ్రామాల ప్రజలు, రైతులు ఇబ్బందులపాలవుతున్నారు.

- మండలంలోని కాట్రియాల నుంచి కామారెడ్డి జిల్లా బిక్కనూరు మండలం రామేశన్‌పల్లి గ్రామాల మధ్య ఐదు కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఈ దారిలో కాట్రియాల పరిధిలో పెద్ద చెరువు అలుగుతోపాటు ఎర్ర కుంట కాల్వ ఉంది.
- కొద్దిపాటి వర్షం కురిసినా కాల్వ పొంగిపొర్లి రోడ్డు కొట్టుకుపోతుంది. గతంలో భారీ వర్షాలు కురిసినప్పుడు వారం రోజులపాటు రాకపోకలు స్తంభించాయి.
- పలు గ్రామాల రైతుల వ్యవసాయ భూములు ఈ దారిలోనే ఉండగా, వారు పంట చేల వద్దకు రావడానికి, తమ పంట ఉత్పత్తులను తరలించుకోవడానికి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.
- గతంలో ఈ రహదారిలో కొద్దిమేర మొరం పోయించినా గ్రామస్తుల ఇబ్బంది తీరలేదు. కాట్రియాల, పరిసర గ్రామాల ప్రజలు కామారెడ్డి వెళ్లడానికి ఇదే దగ్గరి మార్గం అవుతుంది.
- ఈ రోడ్డును పూర్తిస్థాయిలో తారు రోడ్డుగా మారిస్తే రెండు జిల్లాల శివారు గ్రామాల ప్రజల ఇబ్బందులు తీరుతాయని గ్రామస్తులు పేర్కొన్నారు.

తారురోడ్డుగా మార్చాలి



కాట్రియాల , రామేశన్‌పల్లి గ్రామాల మధ్య రోడ్డు పాక్షికంగా శిథిలమై ఎన్నో ఏళ్లుగా ప్రజలు ఇబ్బందుల పాలవుతున్నారు. ప్రతీఏటా వర్షాలు వస్తే ఈదారిలో ప్రయాణాలు స్తంభిస్తున్నాయి. ఈ విషయమై పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లాం. వెంటనే రోడ్డును తారురోడ్డుగా మారిస్తే రెండు జిల్లాల ప్రజలకు సమస్య తీరుతుంది. ఈ రోడ్డుపై రెండు కల్వర్టులు అత్యవసరం.

– కొప్పుల శ్యామయ్య , కాట్రియాల

కష్టాలు తీరుతాయి



కామారెడ్డి జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే ఈ మార్గం దగ్గరవుతుంది. ఐదు కిలోమీటర్ల మేర తారు రోడ్డు మంజూరు చేయాలి. ఈ విషయమై మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాం. ఈ దారిలో ప్రయాణం ప్రతీ వర్షాకాలం ఇబ్బందికరంగా ఉంటుంది. త్వరలో రోడ్డును తారురోడ్డుగా మార్చడానికి నిధులు మంజూరయ్యే అవకాశం ఉంది. అధికారులు చర్యలు తీసుకోవాలి.

–శ్యాములు, సర్పంచ్, కాట్రియాల

- ముఖ్యంగా చెరువు, కుంట వద్ద రోడ్డుపై కల్వర్టుల నిర్మాణం అత్యవసరం కాగా, ఈవిషయమై ఎన్నోసార్లు అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఎంతమాత్రం పట్టించుకోవడం లేదని వాపోయారు.

కేలండర్ ఆవిష్కరణ



మనోహరాబాద్(తూప్రాన్): కేలండర్ ఆవిష్కరిస్తున్న ర్యాకల హేమలతాశేఖర్‌గౌడ్



శివ్వంపేట(నర్సాపూర్) : కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

పెద్దశంకరంపేట(మెదక్):ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని పేట ఎంపీపీ జంగం శ్రీనివాస్ అన్నారు. బుధవారం పేటలో పీఆర్‌టీయూటీఎస్ నూతన సంవత్సర కేలండర్‌ను ఎంపీడీఓ రఫీఖ్ ఉన్నీసా, పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా గౌరవాధ్యక్షుడు రామచంద్రాచారితో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీఓ రియాజుద్దీన్, కో ఆప్షన్ యాదుల్‌హుస్సేన్, సీనియర్ నాయకులు రంగరి సంతోష్, విఠల్‌గౌడ్, రవీందర్, నోడల్ అధికారి రాజేశ్వర్, ఉపాధ్యాయులు గోపీ, ప్రసన్నకుమార్, చంద్రప్రకాశ్, శ్రీనివాస్, జనార్ధన్, రాములు, ప్రవీణ్, బేతయ్య, పాండురంగం తదితరులు పాల్గొన్నారు.

రేగోడ్(మెదక్): ఎంఆర్‌సీ కార్యాలయం వద్ద పీఆర్‌టీయూ నూతన కేలండర్‌ను ఎస్‌ఐ సత్యనారాయణ బుధవారం ఆవిష్కరించారు. పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు అంజిబాబు మాట్లాడారు. కార్యక్రమంలో రేగోడ్ స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు, పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు లక్ష్మణ్, గజ్వాడ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు, పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి నర్సింహారెడ్డి, జిల్లా బాధ్యులు వెంకట్, మండల ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్, మండల బాధ్యులు పంతులు కృష్ణ, అశోక్, మండల ప్రాథమిక సభ్యులు శివానీ, విఠల్, నవీన్, సందీప్, రజిత, కల్పన, రికార్డ్ అసిస్టెంట్ చంద్ర శేఖర్, సుకన్య తదితరులు పాల్గొన్నారు.

శివ్వంపేట(నర్సాపూర్) : మండల పరిధి ఎదుల్లాపూర్ గ్రామానికి చెందిన ప్రముఖ డెంటల్ వైద్యుడు సంతోష్ తూప్రాన్‌లో ఏర్పాటు చేసిన హాస్పిటల్‌కు సంబంధించి కేలండర్‌ని బుధవారం అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్ రామిరెడ్డి, ఎంపీడీఓ నవీన్‌కుమార్, పాల్గొన్నారు.

అల్లాదుర్గం(మెదక్): టీపీయూఎస్ (తపస్) నూతన కేలండర్‌ను అల్లాదుర్గం బాలుర జిల్లా పరిషత్ పాఠశాలలో కాంప్లెక్స్ హెచ్‌ఎం ధనుంజయ్య ఆవిష్కరించారు. కార్యక్రమంలో తపస్ మండల అధ్యక్షుడు గురుచరణం, ప్రధాన కార్యదర్శి స్వామి, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, స్వప్న , హేమలత, జిల్లా కార్యవర్గ సభ్యులు నరేందర్ గౌడ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

చేగుంట(తూప్రాన్): చేగుంటలోని ఎంఈఓ కార్యాలయం వద్ద టీపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం కేలండర్‌ను ఎంపీపీ మాసుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు బాలపోచయ్య, రమేశ్, ఉపాధ్యాయ నాయకులు పాల్గొన్నారు.

మనోహరాబాద్(తూప్రాన్):టీపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం కేలండర్‌ను జెడ్పీ కార్యాలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ ర్యాకల హేమలతాశేఖర్‌గౌడ్ బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ రాజేంద్రప్రసాద్, సీనియర్ నాయకులు ముత్యాలుగౌడ్, నర్సింగరావు, జిల్లా కౌన్సిలర్ నర్సింహరావు, మండల అధ్యక్షుడు నర్సింగం, ప్రధాన కార్యదర్శి మురళీ, మండల ఉపాధ్యక్షుడు పురుషోత్తం, కార్యదర్శి కామేశ్వరావు, ముజాఫర్, హెచ్‌ఎంలు రవీందర్‌రెడ్డి, వెంకటస్వామి, సభ్యులు శైలజ, దీప్తి, పూర్ణచందర్‌రావు, రాఘవచారి, తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్ : పీఆర్‌ఎటీయూ టీఎస్ కేలండర్‌ను ఎమ్మెల్యే మదన్‌రెడ్డి బుధవారం ఆవిష్కరించారు. యూనియన్ నాయకులు సామ్యానాయక్, లక్ష్మీనారాయణ,ఇతర ప్రతినిధులు,తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక తరగతుల పరిశీలన



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ రమేశ్

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని పర్కిబండ ఉన్నత పాఠశాలలను బుధవారం సాయంత్రం డీఈఓ రమేశ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదవ తరగతి విద్యార్థులకు పాఠశాల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారించాలని, కొన్ని ప్రాంతాల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారనే సమాచారం ఉందన్నారు. అందుకే ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ప్రణాళికబద్ధంగా చదువుకుంటూ ముందుకుసాగాలన్నారు. వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా చదవాలన్నారు. విద్యార్థులు ఒత్తిడిలోకాకుండా ప్రశాంతంగా చదువుకోవాలన్నారు. పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలి

మనోహరాబాద్(తూప్రాన్): రోడ్డు విస్తరణ పనుల వద్ద ప్రమాద సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని బుధవారం బీజేపీ యువమోర్చా మండల నాయకులు జీఎమ్మార్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. దండుపల్లి వద్ద చేపట్టిన రోడ్డు విస్తరణ పనుల వద్ద ఎలాంటి ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయకుండా పనులు చేపట్టడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి వెంకటేష్‌గౌడ్, ఉపాధ్యక్షుడు నరేశ్ గౌడ్, యువమోర్చా మండల అధ్యక్షుడు బాలకృష్ణ, ఉపాధ్యక్షుడు విజయ్, ఓబీసీ అధ్యక్షుడు హరిబాబుగౌడ్, మండల నాయకులు గోవర్ధన్‌గౌడ్, రితేష్, నాగరాజు పాల్గొన్నారు.

హామీల అమలులో సీఎం కేసీఆర్ విఫలం



మాట్లాడుతున్న శ్రీశైలం గౌడ్

మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

నర్సాపూర్ : ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో సీఎం కేసీఆర్ విఫలం చెందారని బీజేపీ నియోజకవర్గ పాలక్, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ ఆరోపించారు. బుధవారం నర్సాపూర్ నియోజకవర్గంలోని బూత్ కమిటీ, శక్తి కేంద్రాల ఇన్‌చార్జ్‌ల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులను సీఎం కేసీఆర్ దారి మళ్లించి నిధుల దుర్వినియోగానికి పాల్పడుతున్నాడన్నారు. గ్రామ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు ఆర్థిక పరమైన ఇబ్బందులకు గురయ్యారని, గ్రామాల అభివృద్ధి సైతం కుంటు పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీల ఖాతాల్లో కేంద్రం నిధులు జమ చేయడంతో సర్పంచ్‌లు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతీ గ్రామ బూత్ కమిటీలకు బాధ్యులను నియమించాలని, ఎక్కడైనా నియమించని పక్షంలో ఈనెల 7లోపు నియమించాలని శక్తి కేంద్రాల ఇన్‌చార్జ్‌లకు సూచించారు. ఈ నెల 7న ఉదయం పది గంటల వరకు నియోజకవర్గంలోని బూత్ కమిటీల ఇన్‌చార్జ్‌లు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జ్‌లు నర్సాపూర్‌లోని సాయిక్రిష్ణ ఫంక్షన్ హాలుకు రావాలని, పార్టీ అధినేత నడ్డా వర్చువల్ సమావేశంలో వారితో మాట్లాడుతారని వివరించారు. సమావేశంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గంగిరెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రమేశ్ గౌడ్, పార్టీ నియోజకవర్గ కన్వీనర్ మల్లేశ్ గౌడ్, పార్టీ నాయకులు సురేశ్, రాజేందర్, రఘు వీరారెడ్డి, శ్రీనివాస్, నర్సింహా నాయక్, బుచ్చేశ్ యాదవ్, ఆంజనేయులుగౌడ్, ఎరుకల యాదగిరి, ప్రసాద్, రవిగౌడ్, వెంకట్‌రెడ్డి, మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం శ్రీశైలంగౌడ్‌ను నాయకులు శాలువాలతో సన్మానించారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం



చెక్కును అందజేస్తున్న సునీతారెడ్డి

నర్సాపూర్: సీఎం రిలీఫ్‌ఫండ్ పేదలకు వరంగా మారిందని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి అన్నారు. బుధవారం పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అనారోగ్యం పాలై చికిత్స చేయించుకున్న అనంతరం సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి వారికి ఆర్థిక సహాయం అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు శేఖర్, సత్యంగౌడ్, వెంకటేశ్, షేక్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు. నర్సాపూర్, కౌడిపల్లి మండలాలకు చెందిన పలువురికి చెక్కులు అందజేశారు.

మనోహరాబాద్(తూప్రాన్): రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన ఓ యువకుడి కుటుంబానికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి బుధవారం అందజేశారు. మనోహరాబాద్ మండలం పర్కిబండ గ్రామానికి చెందిన ఠాకూర్ సాయితేజ కొన్ని రోజుల కిందట రోడ్డు ప్రమాదంలో గాయపడిన విషయం తెలిసిందే. అతడికి సంబంధించిన రూ.42 వేల చెక్కును నర్సాపూర్‌లో అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు మంచ శ్రీరామ్, ప్రభాకర్, అశోక్, ఎల్లం, రమేశ్ పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

వ్యక్తి ఆత్మహత్య

తూప్రాన్: మద్యానికి బానిసైన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని నాగులపల్లి గ్రామంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బుక్యా గోపాల్(45) కొంత కాలంగా పక్షవాతంతో బాధపడుతున్నాడు. మందులు వాడగా కొంత ఆరోగ్యం కుదుటపడింది. ఈక్రమంలో క్రమంగా మద్యానికి అలవాటు పడ్డాడు. మంగళవారం తూప్రాన్ సంతకు వచ్చిన గోపాల్ రాత్రి మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. ఈవిషయంలో భార్య అనిత, గోపాల్‌కు మధ్య గొడవ జరిగింది. దీంతో అదే రోజు రాత్రి గోపాల్ ఇంట్లో ఉరివేసుకున్నాడు. గ్రామస్తులు ఇచ్చిన సమాచారంతో ఎస్‌ఐ సురేశ్ కుమార్ విచారణ చేపట్టారు.

ఆధునిక సాగుపై ఆసక్తి పెంచుకోవాలి



దొంతిలో అవగాహన సదస్సు

శివ్వంపేట(నర్సాపూర్): రైతులు వ్యవసాయ సిబ్బంది సూచనలు పాటిస్తూ ఆధునిక సాగుపై ఆసక్తి పెంచుకోవాలని నర్సాపూర్ ఆత్మ కమిటీ చైర్మన్ గొర్రె వెంకట్‌రెడ్డి, ఏడీఏ సురేఖ అన్నారు. బుధవారం మండల పరిధి దొంతి గ్రామంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రతీ రైతు ఈకేవైసీ తప్పకుండా చేసుకోవాని ప్రభుత్వం నుంచి వచ్చే పథకాల ద్వారా లబ్ధిపొందాలన్నారు. ఒకే పంట కాకుండా లాభసాటి పంటల సాగుపై అవగాహన పెంచుకోలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఫణి శశాంక్‌శర్మ, ఉప సర్పంచ్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఇరువర్గాలపై కేసు

అల్లాదుర్గం(మెదక్): ఘర్షణ పడిన కేసులో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ప్రవీణ్ రెడ్డి బుధవారం తెలిపారు. అల్లాదుర్గం గ్రామానికి చెందిన సాయిలుతోపాటు మరికొంత మంది కలిసి ప్రతాప్‌గౌడ్ దుకాణంపై దాడి చేసినట్లు పేర్కొన్నారు. ప్రతాప్‌గౌడ్‌తోపాటు కొందరు సాయిలు, పాండుపై దాడి చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో అనవసరంగా గొడవలు సృష్టిస్తూ, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

◆ పెద్దగొట్టిముక్లలో ఇరుముడి పూజ

శివ్వంపేట(నర్సాపూర్) : మండల పరిధి పెద్దగొట్టిముక్ల గ్రామం నుంచి అయ్యప్పస్వాములు బుధవారం శబరిమల బయలుదేరి వెళ్లారు. ఆలయంలో గురుస్వామి మురళీధర్ రెడ్డి ఆధ్వర్యంలో ఇరుముడి పూజ మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పడిపూజతోపాటు ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేపట్టి భక్తులకు అన్నదానం చేపట్టారు. అనంతరం స్వాములు శబరిమలలోని అయ్యప్ప సన్నిదానానికి బయలుదేరారు.

◆ విద్యుత్ సీఎండీని కలిసిన కాంట్రాక్టర్లు

చేగుంట(తూప్రాన్): విద్యుత్ శాఖ టీఎస్‌ఎస్‌పీడీసీఎల్ సీఎండీ రఘురామరెడ్డిని విద్యుత్ కాంట్రాక్ట్ అసోసియేషన్ తరఫున హైదరాబాద్‌లో కలిసినట్లు అసోసియేషన్ జిల్లా నాయకుడు విశ్వేశ్వర్‌రావు తెలిపారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో భాస్కర్, సత్యం శ్రీనివాస్, మహిపాల్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

◆ పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు

చిన్నశంకరంపేట(మెదక్): రామాయంపేట పోలీస్ సర్కిల్ పరిధిలోని గ్రామాల యువకులకు క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు పేట ఎస్‌ఐ సుభాష్ గౌడ్ తెలిపారు. క్రికెట్, వాలీబాల్, షటిల్ క్రీడాపోటీల్లో పాల్గొనేందుకు 6వ తేదీలోపు పేట పోలీస్‌స్టేషన్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. 7, 8, 9వ తేదీల్లో పోటీలను నిర్వహించి ప్రతిభ కనబర్చిన టీమ్‌లను జిల్లా స్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు.

◆ మల్లికార్జునస్వామి జాతర



ఊరేగింపుగా వెళ్తున్న గ్రామస్తులు

నర్సాపూర్‌రూరల్: మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో బుధవారం శ్రీ కేతకి భ్రమరాంబిక మల్లికార్జున స్వామి జాతర ప్రారంభమైంది. మొదటి రోజు భాగంగా ఊరేగింపు గంగకు వెళ్లారు. కార్యక్రమంలో నర్సాపూర్ అసెంబ్లీ బీజేపీ కన్వీనర్ వాల్దాస్ రాధా మల్లేశ్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, ఉదయ్ గౌడ్, గ్రామ ప్రజలు ఒగ్గు, కళాకారులు పాల్గొన్నా రు.

◆ లక్ష్మీనర్సింహ్మ స్వామికి మకతోరణం వితరణ

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కాళ్ళకల్ గ్రామ పంచాయతీ శివారులో గల స్వయంభూ లక్ష్మీనర్సింహ్మ స్వామికి గ్రామానికి చెందిన యువకుడు నేతికుంట విద్యాసాగర్ ఆలయ పూజారికి సొంత నిధులతో తయారు చేయించిన మకరతోరణం బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా మకరతోరణం స్వామి వద్ద ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. దేవాలయ అభివృద్ధికి తన వంతు సాయం చేస్తానని యువకుడు తెలిపారు. వీరి వెంట వార్డు సభ్యులు ముస్తాఫా, నాయకులు బోల్లబోయిన ఐలేశ్ యాదవ్, సంపత్‌కుమార్ తదితరులున్నారు.

◆ ఉపాధిహామీ పనులు సక్రమంగా చేపట్టాలి

పెద్దశంకరంపేట(మెదక్): ఉపాధి హామీ పనులను సక్రమంగా చేపట్టాలని ఎంపీడీఓ రఫీఖ్ ఉన్నీసా సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఈజీఎస్ సిబ్బందితో నర్సరీ నిర్వహణ, ఉపాధిహామీ పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. గ్రామాల వారిగా గుర్తించిన మొక్కలను నర్సరీలో పెంచాలని, మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఉపాధిహామీ పనులపై కూలీలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ రియాజుద్దీన్, ఈజీఎస్ ఏపీఓ సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

◆ భక్తి మార్గాన్ని అనుసరించాలి

శివ్వంపేట(నర్సాపూర్) : సమాజంలో ప్రతి ఒక్కరూ భక్తిమార్గాన్ని అనుసరించాలని సిద్దిపేట ఆశ్రమ పీఠాధిపతి హకీం షరీఫ్ షిష్తీ అన్నారు. మండల పరిధి బీమ్లా తండాలో ఉన్న దర్గా వద్ద బుధవారం ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి పాల్గొని భక్తులకు శాంతి సందేశం ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పబ్బ మహేశ్ గుప్తా, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమణగౌడ్, సర్పంచ్ చెన్నానాయక్, ఎంపీటీసీ సత్తిరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు కృష్ణారావు, రవినాయక్, రాజశేఖర్‌గౌడ్, శ్రీనివాస్ గౌడ్, దుర్గానాయక్ తదితరులు పాల్గొన్నారు.

◆ తేజశ్రీ కుటుంబానికి న్యాయం చేయాలి

పాపన్నపేట(మెదక్): ఇటీవల ఆత్మహత్య చేసుకొని మృతి చెందిన మనోహరాబాద్ మండలం ధర్మరాజుపల్లికి చెందిన యువతి తేజశ్రీ కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు బైండ్ల సత్యనారాయణ డిమాండ్ చేశారు. బుధవారం పాపన్నపేట మండ లం కొత్తపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం బాధిత కుటుంబానికి రూ.50 లక్షల వరకు పరిహారాన్ని అందజేయాలని డిమాండ్ చేశారు.

◆ చాకరిమెట్లలో ఎమ్మెల్సీ పూజలు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని చాకరిమెట్ల శ్రీ సహకార ఆంజనేయస్వామిని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు బుధవారం దర్శించుకున్నారు. ఆయన పుట్టిన రోజు సందర్భంగా స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేపట్టి హోమం చేపట్టారు. ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఈఓ సార శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

◆ గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరం

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని పైతర, రాంపూర్ గ్రామాల్లో సూరారం మల్లారెడ్డి ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరాలను ఏర్పా టు చేశారు. వైద్య శిబిరంలో సాధారణ వ్యాధులకు సంబంధించి వైద్య నిపుణులు రోగులను పరీక్షించి ఉచితంగా మందులను అందజేశారు. శస్త్ర చికిత్స అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్ నిర్వహిస్తామని ఆస్పత్రి సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో గ్రామాల సర్పంచ్‌లు సంతోష, రాంరెడ్డి, ఎంపీటీసీ ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.



పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

◆ 7వ తేదీ నుంచి క్రీడోత్సవాలు

రామాయంపేట(మెదక్): క్రీడల్లో యువతను ప్రోత్సహించడానికి రామాయంపేట పోలీస్ సర్కిల్ పరిధిలో ఐదు మండలాల్లోని యువకులకు క్రికెట్, వాలీబాల్, షటిల్ పోటీలు నిర్వహించనున్నట్లు సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన సర్కిల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ పోటీల్లో రామాయంపేట, నిజాంపేట, నార్సింగి, చేగుంట, పేట మండలాలకు చెందిన యువకులు పాల్గొనవచ్చాన్నారు. 6వ తేదీలోపు సమీప పోలీస్‌స్టేషన్లలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాల కోసం సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్లలో సంప్రదించాలని సూచించారు.

సైబర్ వలలో పడొద్దు

మనోహరాబాద్(తూప్రాన్): సైబర్ వలలో పడొద్దని ఎస్‌ఐ సందీప్‌రెడ్డి విద్యార్థులకు అవగాహన కల్పించారు. బుధవారం మండలంలోని రామాయపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులకు సైబర్ జాగ్ రూక్త దివాస్ కార్యక్రమంలో భాగంగా పలు అంశాలపై ఎస్‌ఐ అవగాహన కల్పించారు. సైబర్ నేరాల్లో ఎక్కువగా లోన్, యాప్, కేవైసీ నేరాలు, కస్టమర్ కేర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై జాగ్రత్తగా ఉండాలని, అపరిచిత ఫోన్ కాల్‌కు స్పందించొద్దని, ఓటీపీలు చెప్పొద్దన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగలత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గాయత్రీ యజ్ఞం

పాల్గొన్న ఎమ్మెల్యే మదన్ రెడ్డి, మహిళా కమిషన్ చైర్మన్ సునీతారెడ్డి



యజ్ఞంలో ఎమ్మెల్యే మదన్ రెడ్డి

కొల్చారం(నర్సాపూర్): మండలం రంగంపేటలోని ఆశ్రమంలో మూడు రోజులుగా జరుగుతున్న శ్రీ గాయత్రీ యజ్ఞం బుధవారం పూర్ణాహుతి కార్యక్రమంతో ముగిసింది. నర్సాపూర్ డివిజన్ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆశ్రమ పీఠాధిపతి శ్రీ గురు మాధవానంద సరస్వతీ స్వామి పర్యవేక్షణ మధ్య ఈ యజ్ఞం చేపట్టారు. ఎమ్మెల్యే మదన్ రెడ్డి, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ సునీతారెడ్డి హాజరై స్వామి వారి ఆశీస్సులను పొందారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ పాలుపంచుకోవాలన్నారు. నియోజకవర్గ బ్రాహ్మణులు చేపట్టిన ఈ యజ్ఞం ప్రజలు సుభిక్షంగా ఉండేందుకు తోడ్పడుతుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం నాయకులు హరిప్రసాద్ శర్మ, హరిక్రిష్ణ శర్మ, మాణిక్య శర్మ, కొల్చారం మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు మంజుల కాశీనాథ్, మెదక్ మార్కెటింగ్ కమిటీ వైస్ చైర్మన్ సావిత్రి రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గౌరిశంకర్ గుప్తా, ఎనగండ్ల సర్పంచ్ వీరారెడ్డి, నర్సాపూర్ మున్సిపల్ కౌన్సిలర్ అశోక్ గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు సంతోష్, బండి రమేశ్, శివాంజనేయులు, ప్రభులింగం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.